



గుంటూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న పెమ్మసాని

పత్తి కొనుగోలు వ్యాపారం కాదు

- పూర్తిగా కొనుగోలయ్యే వరకు కేంద్రాలు పని చేయాలి
- సీసీఐ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు

6

వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



వీరుల ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఊతమిస్తే.. ఉపాధి

8



- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు



అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పునఃప్రారంభం

8

సైనికుల ఊరు.. భావాజీపాలెం



- ఇంటికి ఇద్దరు, ముగ్గురు సైనికులు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

- 18 మోటార్ సైకిళ్లు, 170 గ్రాముల బంగారం, నాలుగు కిలోల వెండి స్వాధీనం

6

నేల బావిలో స్నానానికి దిగి ఇద్దరు శివస్వాముల మృతి

- వినుకొండ మండలం నడిగడ్డలో విషాదం



మురుగునీటి శుద్ధి ప్లాంట్

- టెండర్ల దశలోనే మురుగు నీటిశుద్ధి ప్లాంట్లు
- రూ.151.33 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- స్థలాలు కేటాయించని మున్సిపల్ అధికారులు
- ప్రజారోగ్య పనులనూ పట్టించుకోని పురపాలకలు
- జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశాలు బేఖాతర్

నిధులున్నా.. నిర్లక్ష్యం

మురుగు.. మున్సిపాల్టీల్లో ప్రధాన సమస్యగా ఉంది. నీటిని, ఆహార పదార్థాలను, గాలిని కలుషితం చేసేస్తోంది. ప్రజల ఆరోగ్యాలను గుల్లచేస్తోంది. పట్టణాల్లో ఉత్పత్తి అయి పల్లెలను, పొలాలను పాడుచేస్తోంది. పర్యావరణానికి హానికరంగా ఉంటోంది. మురుగునీటితో సాగు వల్ల ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. ఇలాంటి మురుగును బాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. మున్సిపాల్టీల వారీగా ప్రత్యేకంగా నిధులు కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్‌టీపీ) నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌టీపీల నిర్మాణాలకు టెండర్లు పిలిచారు కానీ పనులు చేపట్టలేదు. మున్సిపాల్టీల్లో వీటి నిర్మాణానికి స్థలాలు చూపడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడటంలేదు. ఎస్‌టీపీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.151.33 కోట్లు నిధులు మంజూరు చేయగా.. స్థలాలు అప్పగిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నా, పురపాలక సంఘాల్లో ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వంలోనైనా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు పట్టాలు ఎక్కాలని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నిధులు మంజూరు ఇలా..

మున్సిపాల్టీ	కేటాయింపు (రూ.కోట్లలో)
వినుకొండ	18.60
పిడుగురాళ్ల	18.42
చిలకలూరిపేట	69.53
తెనాలి	31.50
బాపట్ల	4.98
చీరాల	8.30

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మురుగునీటి కాలుష్యాన్ని నివారించేందుకు మున్సిపల్ పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ల విషయంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మురుగు నీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు స్థలాల కేటాయింపు దశలోనే ఉన్నాయి. మున్సిపల్ పట్టణాల్లో నిత్యం ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు డ్రెయిన్ల ద్వారా శివార్లకు ప్రవహిస్తోంది. ఈ నీటి వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగు నీరు చెరువులు, వాగుల్లోకి చేరుతుండటంతో ఆ నీరు కూడా కలుషితం అవుతోంది. పంటల సాగుకు ఈ నీటిని వినియోగిస్తుండటంతో ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయి. నీటి కలుషితాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షించేందుకు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాలని మున్సిపాల్టీలను జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశించింది. మున్సిపాల్టీల నుంచి ప్రతి రోజు వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరమే ఆ నీటిని బయటకు విడుదల చేయాలని సూచించింది. అయితే ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఎస్‌టీపీల నిర్మాణం విషయంలో పుర పాలకులు సరైన రీతిలో స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఎస్‌టీపీలు ప్రతిపాదించిన ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. టెండర్లు నిర్వహించి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

పనులు చేపట్టకుండానే..

ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీలను వేగవంతంగా నిర్మించాల్సిన మున్సిపల్ అధికారులు పనులు చేపట్టకుండానే చేపట్టినట్టుగా జాతీయ హరిత న్యాయస్థానాన్ని మభ్యపెడుతున్నారు. ఎస్‌టీపీల నిర్మాణం విషయంలో జాతీయ హరిత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. టెండర్లు నిర్వహించి చేతులు దులుపుకున్న అధికారులు పనులు ప్రారంభించినట్టుగా ట్రిబ్యునల్‌ను మభ్య పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. హరిత న్యాయస్థానం ఓ కమిటీని నియమించి ఎస్‌టీపీల నిర్మాణంపై అధికారులు ఇస్తున్న నివేదికలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

7న బాపట్లకు సీఎం చంద్రబాబు

- రాష్ట్రస్థాయి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల 7న బాపట్లకు రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే మెగా పేరెంట్- టీచర్ మీటింగ్‌ను బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక తొలిసారి జిల్లా కేంద్రం బాపట్లకు రానుండటంతో ఏర్పాట్లపై యంత్రాగాన్ని కలెక్టర్ వెంకటమురళి అప్రమత్తం చేశారు. గతంలో చేనేత దినోత్సవానికి జిల్లా పరిధిలోని చీరాలకు సీఎం చంద్రబాబు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో అది రద్దయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వరదల సమయంలో కూడా సీఎం పర్యటన రెండు సార్లు ఖరారై వాతావరణం అనుకూలించక రద్దైంది. ఈ క్రమంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కోసం చంద్రబాబు బాపట్లకు రానుండడంతో ఆయన పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి బాపట్ల పర్యటన ఖరారైనట్టు కలెక్టర్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ కొరకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని పోలీసు కవాతు మైదానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా మైదానాలను పరిశీలించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా, పీడీ కత్తి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాద రావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సాగు ఎన్నికలకు.. రీషెడ్యూల్

- వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల
- 8న నీటి సంఘాలకు, 11న డీసీలకు ఓటింగ్
- 14న ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకునేలా ఉత్తర్వులు



గుంటూరు బ్రాంచి కెనాల్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం శుక్రవారం రీషెడ్యూల్‌ను విడుదల చేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 21న విడుదల చేయాల్సిన నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో వచ్చే నెల 5న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగునీటి సంఘాలు(డబ్ల్యుయూఏ) ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. దాదాపు 7 లక్షల మంది రైతులు ఓటర్లుగా నమోదు చేశారు. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నికుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నికుంటారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. వీటికి నోటిఫికేషన్‌ను 5న విడుదల చేయనున్నారు.

14న ప్రాజెక్టు కమిటీకి ఎన్నిక

సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీకి 14న ఎన్నికల నిర్వహించనున్నారు. 32 డీసీల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికాలు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాల ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి.

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. డీసీల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, దామ్మరు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1,2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

- ఐదు స్కీముల కింద రూ.లక్ష చొప్పున..
- మూడు జిల్లాల్లోని 5,339 కేంద్రాలకు మహర్దశ
- తాగునీరు, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అంగన్వాడీలకు.. నిధులు

నిధుల కేటాయింపు ఇలా..

మంచినీటి సదుపాయం	రూ.17,000
మరుగుదొడ్ల నిర్మాణం	రూ.36,000
మరమ్మతులు, రంగులు	రూ.19,800
పెరటి తోట నిర్వహణ	రూ.10,000
వర్షపు నీరు నిర్వహణ	రూ.16,000



గుంటూరులో అంగన్వాడీ మరుగుదొడ్డికి రంగులు వేస్తున్న కార్మికుడు



తెనాలిలో తుది దశకు చేరిన అంగన్వాడీ కేంద్రంలోని మరుగుదొడ్డి

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాగునీరు.. మరుగుదొడ్ల సౌకర్యం లేక.. భవనాలు రంగులు వెలిసి.. అధ్వానంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలు అద్భుతంగా మారనున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, పోషణ అందించే అంగన్‌వాడీ కేంద్రాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా మారాయి. వివిధ సమస్యలతో కునారిల్లిపోయిన అంగన్వాడీలకు గత ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. వాటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఐదు రకాల స్కీముల కింద భారీగా నిధులు కేటాయించింది. ఆయా నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల తలరాత మారబోతోంది. మూడు జిల్లాల్లో మొత్తం 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా అంగన్వాడీ కేంద్రాలు సమస్యల నిలయాలుగా మారిపోయాయి. కనీస అవసరాలైన మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా లేని కేంద్రాలు వందల సంఖ్యలో ఉన్నాయి. 2014- 19కి ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పెరటి తోటల పెంపకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పెరటి తోటలో మొక్కలు ఎండిపోయినా పట్టించుకోలేదు. చిన్నారుల ఆట వస్తువులు, బొమ్మలకు కూడా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా తయారయ్యాయి. అవి కేవలం పిల్లలు, తల్లులకు పప్పుబెల్లాలు పంచిపెట్టే కేంద్రాలుగా మారాయి.

● భారీగా నిధుల కేటాయింపు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల్లో పేరుకుపోయిన సమస్యలపై కదలిక వచ్చింది. అంగన్వాడీ కేంద్రాల్లోని సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు కేటాయించింది. తక్షణ ప్రాతిపదికన అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేసింది. ఆయా కేంద్రాల్లోని తాగునీటి, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు విడుదల చేసింది. పెరటి పంటలకు 'పోషణ వాటిక' కింద నిధులు ఇచ్చింది. వర్షపు నీటి నిర్వహణ పేరుతో కూడా

(మిగతా 8వ పేజీలో..)

- సీఐలచే ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అమ్మకాలు, ధరలపై ప్రత్యేకంగా పరిశీలన
- 20 బెల్టుషాపులపై కేసులు.. 15 మంది అరెస్టు
- ఆంధ్రజ్యోతి కథనంతో ఎక్సైజ్ అధికారుల్లో కదలిక
- బెల్టు షాపులపై ఉక్కుపాదం : డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్

ముమ్మరంగా ఎక్సైజ్ తనిఖీలు

తెనాలి క్రైం, గుంటూరు (కార్పొరేషన్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలు, మద్యం దుకాణాల్లో లూజు విక్రయాలు, ఎమ్మార్పీలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం సీఐల నేతృత్వంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో వాడవాడలా మద్యం అనే శీర్షికన ప్రచురితమైన ప్రత్యేక కథనంపై ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు స్పందించారు. గుంటూరు జిల్లాలో మొత్తం ఆరు బెల్టు షాపులపై కేసులు నమోదుచేసి ఆరుగురిని అరెస్టు చేశారు. 9.27 లీటర్ల మద్యాన్ని, 7.80 లీటర్ల బీరును సీజ్ చేశారు. చిలకలూరిపేట, పెదకూరపాడు, వినుకొండ, పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఏడు బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. 10.80 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎల్ కేసు నమోదైంది. 8 బీర్ బాటిళ్లను కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేశారు. మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆరు సారా కేసులు నమోదు చేసి ఒకర్ని అరెస్టు చేశారు. రెండు లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వాడే ముడిపదార్థాలను ధ్వంసం చేశారు.

రంగంలోకి ప్రత్యేక నిఘా బృందాలు

మద్యం బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపినట్టు, ఇప్పటికే ప్రత్యేక నిఘా బృందాలు రంగంలోకి దిగాయని ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. తెనాలిలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఎక్సైజ్ పాలసీని పరిశీలించిన అనంతరమే ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్తమమైన మద్యం పాలసీని తీసుకు వచ్చిందన్నారు. నెల రోజుల్లో 235 కేసులు నమోదు చేశామని, మద్యం అక్రమ అమ్మకందారులు 215 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక వ్యక్తి వద్ద మూడు బాటిల్స్ కంటే మించి ఉండకూడదన్నారు. మద్యం అక్రమ అమ్మకాలు చేసినా, ప్రోత్సహించినా ఆ దుకాణదారుడికి రూ.5 లక్షల పెనాల్టీ విధిస్తామని తెలిపారు. రెండోసారి కేసు నమోదైతే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గతంలో మద్యం ధరల భారం ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం అందుబాటు ధరలు ఉండటంతో అమ్మకాలు పెరిగాయన్నారు. బెల్ట్‌షాపులపై తనిఖీలకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణకుమారి, సీఐ యం.యశోధరదేవి, ఎస్‌ఐలు, ఫణికుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

● బీసీ సంక్షేమశాఖ డీడీ మయూరి

గుంటూరు (విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ పరీక్షకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.మయూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోగా గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తులు పంపాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి విజయవాడకు శిక్షణకు పంపుతామని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం సంవత్సరానికి లక్షలోపు ఉండాలని, బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని, ఇతర వివరాల కోసం 9959528410 సంప్రదించాలని సూచించారు.

27న డైట్‌లో సంప్రదాయ నృత్య పోటీలు

గుంటూరు (విద్య), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 27న యడ్లపాడు సమీపంలోని బోయపాలెం ప్రభుత్వ శిక్షణా సంస్థ(డైట్)లో జిల్లా స్థాయి బాలరంగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తప్పెటగుళ్లు, కర్రసాము, చెంచులాట, దింసా, జాలరీ, బంజార అంశాలతో నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. నృత్య సమయం పది నిమిషాలు మించకూడదనీ, ఒక్కో బృందంలో 10 మంది విద్యార్థులు ఉండవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు డాక్టర్ కృష్ణప్రసాద్ డైట్ లెక్చరర్(8018207528)ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించాలని జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలపై చర్చ జరుగుతుందని వెల్లడించారు.

గల్లంతైన బాలికల్లో యామిని మృతదేహం లభ్యం



ఈపూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో గురువారం గల్లంతైన ఇద్దరు బాలికల్లో పెద్ద పాప యామిని (10) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఉదయం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలిస్తుండగా కాలువలో పడిన దగ్గరలో మృతదేహం నీటిపైకి తేలింది. చిన్న పాప కావ్య(7) ఆచూకీ లభ్యం కాలేదు. సాయంత్రం వరకు కాలువలో గాలించారు. యామిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు.

పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు

● రైతులను ఆదుకోవడానికి కేంద్రం ఏర్పాటు చేసిన బాధ్యత

● కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉత్పత్తి చేసిన పత్తిని సీసీఐ అధికారులు మార్చి నెల చివరి దాకా తప్పక కొనుగోలు చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, రైతుల ఆందోళనపై సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యాలు, రైతులతో కేంద్ర మంత్రి పెమ్మసాని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ గత వారం రోజులుగా పత్తి కొనుగోలుపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, అందుకు ఆందోళన వెలిబుచ్చుతున్న రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించే క్రమంలో ఈరోజు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు, రైతులను ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన ఒక బాధ్యత అని తెలిపారు. ఉత్పత్తి అవుతున్న పత్తి పూర్తిగా కొనుగోలు అయ్యే వరకు సీసీఐ కేంద్రాలు పని చేయాలని సూచించారు. పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న పరిణామాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. రైతు తనంతట తానుగా దళారులకు అమ్మేలా చేసి, ఆ తర్వాత దళారులు ఆ పత్తిని సీసీఐకి విక్రయించేలా చేస్తున్నారని చెప్పారు. ఈ విధంగా వచ్చే మొత్తాన్ని పంచుకోవడానికే ఇలా జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా పత్తి అమ్మకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

నాలుగు అంశాలపై సానుకూల స్పందన

అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమీక్షలో ముఖ్యంగా నాలుగు అంశాలపై సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందించి అందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారన్నారు. 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద 61 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అందుకు సానుకూలంగా అధికారులు స్పందించారు. ప్రస్తుతం సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి, శనివారం కూడా కొనుగోళ్లు జరపాలని సీసీఐ అధికారులను కోరగా అందుకు వారు అంగీకరించారని తెలిపారు. పత్తి అమ్మకానికి సంబంధించి డాక్యుమెంటేషన్‌కు వేలిముద్రలు వేయడానికి సాయంత్రం 6 గంటల వరకే వెసులుబాటు ఉండటంతో రైతులకు ఇబ్బందికరంగా ఉందనీ, ఈ సమయాన్ని రాత్రి 7.30 గంటల వరకు పొడిగించేలా చూడాలని సీసీఐ అధికారులకు స్పష్టం చేయగా, అందుకు వారు ఒప్పుకున్నారన్నారు. పత్తి బోరాలు తెచ్చే విధానం, లోడింగ్ చేసే పద్ధతి, వాతావరణం పలు అంశాలలో ఉన్న తేడాల వలన తేమ పరీక్షల్లో విభిన్న ఫలితాలు తలెత్తుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయం చేసుకుని రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సీసీఐ డైరెక్టర్ మార్కెటింగ్ విజయ్ కురదాగి, మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరక్టర్ రాజబాబు, గుంటూరు మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి, జిన్నింగ్ మిల్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాతృమూర్తిని మానవత్వం ఆదుకుంది

● అమ్మను రోడ్డుపై వదిలి వెళ్లిన పిల్లలు

● చలికి వణికిపోయిన తల్లి

● సబ్‌కలెక్టర్ ఆదేశాలతో నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థకు తరలింపు



వృద్ధురాలిని పరిశీలిస్తున్న నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి భారమైందనుకున్నారేమో ఆ కుమారులు. బాల్యంలో మలమూత్రాలు శుభ్రం చేసి స్నానం చేయించి లాలిపాటలతో గోరుముద్దలు తినిపించిన ఆ చేయి వృద్ధాప్యంలో భారంగా మారిందనుకున్నారో ఏమో.. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న బిడ్డలే నడిరోడ్డుపై వదిలేసి వెళ్తుంటే ఆ తల్లి ఎంత తల్లడిల్లి ఉంటుందో.. తెనాలిలో శుక్రవారం వెలుగుచూసిన ఓ వృద్ధురాలి ఉదంతం ఇది. తెనాలి నాలుగు వరుసల రోడ్డులో మార్కెట్ వంతెన వద్ద ఫుట్‌పాత్‌పై సరైన వస్త్రాలు లేక చలికి గజగజా వణుకుతూ అల్లాడిపోతున్న 92 ఏళ్ల వృద్ధురాలిని హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు గుర్తించారు. సరైన ఆహారం తీసుకోక నీరసించి అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలి బాధను చూడలేక మంచినీరు, ఆహారం అందించారు. దుస్తులు కప్పి పక్కనే ఉన్న బస్‌షెల్టర్‌లో ఉంచి చలికి తట్టుకునేలా కోటు ఇచ్చారు. ఆమె కొంత కోలుకునేలా సపర్యలు చేశారు. వృద్ధురాలి పేరు అంజమ్మ అని తనది తెనాలిలోని చెంచుపేట అని చెప్పింది. తమ పిల్లలే తనను ఆటోలో తీసుకువచ్చి గురువారం రాత్రి ఇక్కడ వదిలేసి వెళ్లిపోయారని కన్నీటి పర్యంతమైంది. ఇంటి అడ్రస్, ఇతర వివరాలు చెప్పేందుకు ఆమె ఇష్టపడటంలేదు. ప్రస్తుతం ఆమె నడిచే స్థితిలో కూడా లేదు. వృద్ధురాలి బాధను స్థానిక అధికారులకు, మీడియా దృష్టికి హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు తీసుకు వెళ్లారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ సంజన సిన్హా తహసీల్దార్ గోపాలకృష్ణను, మున్సిపల్ అధికారులను ఆమె సంరక్షణ చర్యలపై ఆదేశించారు. దీంతో గుంటూరుకు చెందిన నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి వృద్ధురాలి సంరక్షణాబాధ్యతలను వారికి అప్పగించారు. వృద్ధురాలి పట్ల మానవత్వం చాటిన హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధులను తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు అధికారులు, మానవతావాదులు అభినందించారు. వృద్ధురాలిని రోడ్డుపై విడిచివెళ్లిన కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నామని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు.

చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 18 మోటార్ సైకిళ్లు, 170 గ్రాముల బంగారం, నాలుగు కిలోలు వెండి, పదివేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి 6 కేసుల్లో నిందితుడైన షేక్ సుభానిని అరెస్టు చేసి 170 గ్రాములు బంగారం, నాలుగు కిలోల వెండి, పదివేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సుభాని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో చోరీలకు పాల్పడ్డాడు. అయినవోలు పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఎనిమిది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన లింగం యలమంద, కొమ్మిరి శెట్టి రామాంజనేయులులను అరెస్టు చేశారు. ఈపూర్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి కొండ్రముట్ల గ్రామ సచివాలయంలో చోరీకి పాల్పడిన జరపాల వెంకటేశ్వర్ నాయక్, భూక్య బాలాజీ నాయక్, పొడిపలన గణపతులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4 లక్షలు విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు సంబంధించి పది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన మట్టపల్లి హరిబాబు, చల్లా భవాని శంకర్, షేక్ మస్తాన్‌వలిలను అరెస్టు చేశారు. కేసుల దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన అధికారులను ప్రశంసించారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థ

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థను తీసుకువెళ్లటానికి పోలీస్ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి త్వరలో 'మీతో మేము' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

● జనవరి 1వ తేదీ నుంచి అమలు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లగా నడుపుతున్న రైల్వే శాఖ వాటి నంబర్లను జనవరి 1వ తేదీ నుంచి మార్పు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుత నంబరు	రైలు	కొత్త నంబరు
07464	విజయవాడ-గుంటూరు	67769
07465	గుంటూరు - విజయవాడ	67770
07277	మిర్యాలగూడ - నడికుడి	67777
07973	నడికుడి - మిర్యాలగూడ	67778
07974	మిర్యాలగూడ - కాచీగూడ	67776
07791	కాచీగూడ - నడికుడి	67779
07792	నడికుడి - కాచీగూడ	67780
07279	విజయవాడ - తెనాలి	67213
07575	తెనాలి - విజయవాడ	67214
07786	గుంటూరు - రేపల్లె	67223
07787	రేపల్లె - గుంటూరు	67234
07889	రేపల్లె - మార్కాపురం రోడ్డు	67238
07282	తెనాలి - గుంటూరు	67236
07628	విజయవాడ - గుంటూరు	67229
07629	విజయవాడ - తెనాలి	67221
07630	తెనాలి - విజయవాడ	67222
07781	విజయవాడ - మాచర్ల	67227
07782	మాచర్ల - విజయవాడ	67228
07864	గుంటూరు - విజయవాడ	67230
07873	రేపల్లె - తెనాలి	67224
07874	తెనాలి - రేపల్లె	67231
07875	రేపల్లె - తెనాలి	67232
07876	తెనాలి - రేపల్లె	67233
07887	గుంటూరు - తెనాలి	67235
07888	తెనాలి - రేపల్లె	67237
07890	మార్కాపురం రోడ్డు - తెనాలి	67239
07281	నరసాపూర్ - గుంటూరు	67247
07784	గుంటూరు - రేపల్లె	67249
07785	రేపల్లె - గుంటూరు	67250
07976	గుంటూరు - విజయవాడ	67248
07783	విజయవాడ - గుంటూరు	57201
07788	గుంటూరు - విజయవాడ	57202
07579	నడికుడి - మాచర్ల	57205
07580	మాచర్ల - నడికుడి	57206
07779	గుంటూరు - మాచర్ల	57203
07780	మాచర్ల - గుంటూరు	57204


రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి (50), భార్య సురేఖ, కుమారుడు హరినాథ్‌రెడ్డి (19) కలిసి ద్విచక్రవాహనంపై నంబూరు వెళ్తున్నారు. ఇదే క్రమంలో హాఫ్‌పేట - ఖాజీపేట మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తండ్రి, కొడుకులు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా సురేఖకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా హరినాథ్‌రెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవీంద్రారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్సపొందుతూ రవీంద్రారెడ్డి కూడా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త, కుమారుడిని కోల్పోయిన సురేఖ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. హరినాథ్‌రెడ్డి ఐటీఐ చదువుతుండగా నంబూరులో స్థిరపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.


బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

దాచేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దాచేపల్లి నాగులేరు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం నారాయణపురం గ్రామానికి చెందిన బండ్ల మహేష్(18) ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ దాచేపల్లి నుంచి నారాయణపురం వస్తున్నాడు. ఈ క్రమంలో బస్సును స్వల్పంగా ఢీకొట్టగా బండి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు తగిలింది. బండి పైనుంచి కిందపడిన యువకుడి తలకు బలమైన గాయాలయ్యాయి. మృతునికి వివాహం కాలేదు. కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దాచేపల్లి ఎస్ఐ సౌందర్‌రాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో స్నానం చేస్తూ ఇద్దరు శివస్వాములు మృతి



రామకృష్ణ(ఫైల్)



మల్లికార్జున (ఫైల్)

వినుకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు శివ మాలధారణ యువకులు మృతి చెందిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కాల్వ వద్ద గల ఆరేళ్ళ అరుణ్ పంట పొలంలోని నేల బావిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఒంటేరు రాంబాబు చేసిన పడిపూజ కార్యక్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాలధారణ స్వాములు అందరూ బిజీబిజీగా గడిపారు. సద్ది అనంతరం మిగిలిన పనులు పూర్తి చేద్దామని శివమాల ధరించిన కామస్వామి రామకృష్ణ (27), జెట్టి మల్లికార్జున(22) స్నానానికని నేలబావి వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో మృతి చెందారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నాగరాజు, నరసింహారావు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు బావి వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వినుకొండ పట్టణ సీఐ శోభన బాబు, తహసీల్దార్ సురేష్ నాయక్, ఫైర్ అధికారి నాగేశ్వరరావు సిబ్బందితో బావి వద్దకు చేరుకున్నారు. సుమారు 30 అడుగుల లోతులో ఉన్న నీటిని 6 ట్రాక్టర్ల సహాయంతోపాటు ఫైర్ అధికారులు తమ వద్ద ఉన్న యంత్రాలతో రాత్రి 8 గంటల వరకు నీటిని తోడి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతుడు రామకృష్ణకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఒక కుమార్తె ఉంది. ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ శోభనబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టిన మహిళలు



వినతి పత్రం అందజేస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట గ్రామాల్లోని మహిళా సంఘాల్లో రూ.55 లక్షలు గోల్‌మాల్ అయ్యాయని, తమకు న్యాయం చేయాలని సంబంధిత సంఘాల సభ్యులు శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టి మండల సమాఖ్యకు వినతి పత్రం అందజేశారు. ధరణికోట గ్రామంలో 185 మహిళా సంఘాలు ఉండగా ఆరుగురు యానిమేటర్‌లు ఉన్నారు. అత్తలూరు గ్రామంలో 100 మహిళా సంఘాలు ఉండగా ముగ్గురు యానిమేటర్‌లు ఉన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న స్త్రీనిధి రుణాలు చెల్లించి మళ్లీ రుణాలు పొందేందుకు మండల సమాఖ్య వద్దకు వెళ్లగా వారు తీసుకున్న రుణాలు చెల్లించనట్లు ఉంది. దీంతో సభ్యులు ఆందోళన చెంది తాము రుణాలు చెల్లించినప్పటికీ తమ పేరు మీద అప్పులు ఉండటం ఏమిటని మహిళలంతా మండల సమాఖ్య అధ్యక్షురాలు చింతా నాగలక్ష్మికి వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని నాగలక్ష్మి తెలిపారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

(5 పేజీ తరువాయి)

ఎస్‌టీపీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ మొట్టికాయలు వేసినా గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. మున్సిపాల్టీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థలాలను కేటాయించలేదు. పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఎస్‌టీపీల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీల పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించాలి. స్థలాలను కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

తెనాలిలోనే పనులు..

గుంటూరు జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో మూడు, బాపట్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు విడుదల చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పథకానికి ఈ ఎస్‌టీపీలను అనుసంధానం చేశారు. అయితే మూడు జిల్లాల్లో ఆరు మున్సిపాలిటీలకు ఒక్క గుంటూరు జిల్లా తెనాలిలో మాత్రమే మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. తెనాలిలో అమృత్ పథకం కింద రూ.31.50 కోట్లతో పనులు చేస్తున్నారు. వినుకొండ మున్సిపాల్టీలో ముట్లకుంటకాలనీ ప్రాంతంలో 5.70 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ స్థలంలో కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. వినుకొండలో చెక్కవాగు నిర్మల స్కూల్ ప్రాంతంలో 5.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. వీటికి రూ.18.60 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లలో రూ.18.42 కోట్లతో 5.90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో హనుమందిర్ రోడ్డులో, 5.20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో మరో ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. ఈ రెండు మున్సిపాల్టీలలో నాలుగు ఎస్‌టీపీల నిర్మాణ పనులు టెండర్‌ను శ్రీకృష్ణ ఎన్వీరో ఇంజనీర్స్ విజయవాడ సంస్థ దక్కించుకుంది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో అమృత్ పథకంలో భాగంగా రూ.69.53 కోట్లతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బాపట్ల జిల్లా బాపట్ల మున్సిపాల్టీలో రూ.4.98 కోట్లతో 3 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్‌టీపీని కంపోస్టు యార్డు ప్రాంతంలో నిర్మించాలి. ఇందుకు సంబంధించి స్థలం కేటాయింపు జరగలేదు. చీరాల మున్సిపాల్టీలో రూ.8.30 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఐకేనగర్ దండుబాట ప్రాంతంలో నిర్మించాలని స్థలాన్ని గుర్తించారు. అయితే స్థల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయింది. ఈ రెండు మున్సిపాల్టీలలో ఎస్‌టీపీల టెండర్‌ను సింగన్ ప్రాజెక్టు లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ దక్కించుకుంది.

వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

● జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో నిర్వహించనున్న వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీరుల దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పల్నాటి చరిత్రను పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వీరులు ఉపయోగించిన ఆయుధాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

45,111 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,839 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,111 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 29,101 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	8000	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు. 5	11000	13000
273	10000	13000	273	8500	12200
341	8000	15500	341	8000	15000
4884	-	-	4884	9000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	9000	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	9500	13500
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	4500	11000

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆశ్రమ పాఠశాలను ఇన్‌చార్జి తహసీల్దార్ కే పుల్లారావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వీఆర్వో దాసు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనులు వేగవంతం

● ఎంపీడీవో రామచంద్రరావు



పిడుగురాళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో పల్లె పండుగ కార్యక్రమంతో పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని పిడుగురాళ్ల ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పరిధిలో పల్లెపండుగ కార్యక్రమానికి మంజూరైన పనుల వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.



ప్రశ్న: గ్రామ పంచాయతీలకు పల్లెపండుగ నిధులు వచ్చాయా?

జవాబు : ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిని బట్టి రూ.30 లక్షల వరకు మంజూరయ్యాయి.

ప్రశ్న: పనులు ప్రారంభించారా?

జవాబు : పల్లెపండుగ కింద ఆమోదమైన పనులను గ్రామ పంచాయతీలలో ప్రారంభించారు. మరికొన్నింటిని ప్రారంభించాల్సి ఉంది. ఇసుక అందుబాటులో లేకపోవడంతో కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయి.

ప్రశ్న: పారిశుధ్యం ఎలా ఉంది?

జవాబు : గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యంకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు వీధులన్నీ శుభ్రం చేయించడం, కాల్వలో పూడిక తీయించడం జరుగుతుంది.

ప్రశ్న: ఇంటి పన్ను వసూళ్లు ఎలా ఉన్నాయి?

జవాబు : గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను వసూళ్లలో సిబ్బంది ఉన్నా కొస్త ఆలస్యంగా జమ అవుతున్నాయి. డిసెంబరు నాటికి 70 శాతం, మార్చి నాటికి 100 శాతం పన్ను వసూలయ్యేలా పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నాం.

23, 24 తేదీల్లో ఓటు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

సత్తెనపల్లి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2025లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లలో ఈనెల 23, 24 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్టు సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ కేవీస్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్ వద్దకు వచ్చి బీఎల్‌వోను కలసి ఓటు నమోదు, తొలగింపులు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● బెల్లంకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మున్నీసా బేగం అన్నారు. ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బెల్లంకొండ మండలం ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా ఈనెల 23, 24 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

● మాచవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు కొరకు అర్జీలు పెట్టుకోవాలని తహసీల్దార్ క్షమారాణి శుక్రవారం తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో మండల పరిధిలోని అన్ని గ్రామాల పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు ఉంటారని అయా గ్రామాల యువతీ, యువకులు వారి వద్దకు వెళ్ళి ఓటు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

● రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దుర్గేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీలలో మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవల్ అధికారి వారి సమక్షంలో స్పెషల్ క్యాంపెన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

● నకరికల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23, 24 తేదీలలో మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారి అందుబాటులో ఉంటారని తహసీల్దార్ కే.పుల్లారావు శుక్రవారం తెలిపారు. తొలగింపులు, ఓటు కార్డులో సవరణలు చేసుకొనుటకు సంబంధిత బూత్ లెవల్ అధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

యూటీఎఫ్ మహా సభలను జయప్రదం చేయాలి

క్రోసూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో డిసెంబరు 1వ తేదీన జరిగే యూటీఎఫ్ జిల్లా ప్రథమ మహా సభలు, స్వర్ణోత్సవ సంబరాలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు బోళ్ల నరసింహారెడ్డి, ఎస్.ప్రకాశరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో మహా సభల పోస్టర్లను వారు విడుదల చేశారు. పాఠశాలల పని వేళలను పెంచటం అశాస్త్రీయం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే.లక్ష్మణరావు, ఖాజావలి, శౌరిరెడ్డి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

భాష్యం నవీన్ జన్మదిన వేడుకలు

అమరావతి, నవంబరు 22 : పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోదరుడు నవీన్ జన్మదినం పురస్కరించుకుని అమరావతిలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బూసియ్య యాదవ్, రాయి భాస్కర్, యస్ రాంబాబు తదితరులు ఉన్నారు.

దమ్ము ట్రాక్టర్ల డ్రైవర్లపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం

● చర్యలకు సిఫారసు



నూతనంగా నిర్మిస్తున్న మంచికల్లు రహదారిపై దమ్ముట్రాక్టర్‌ను నిలువరిస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు

రెంటచింతల,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగరికతకు చిహ్నాలైన రహదారులను నాశనం చేస్తున్న దమ్ము ట్రాక్టర్ల డ్రైవర్లపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. మండలంలోని మంచికల్లు రహదారికి రూ.40 లక్షలతో గుంతలు పూడ్చి తారు వేసే నిమిత్తం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దమ్ము చక్రాలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఆ మార్గం నుంచి వెళ్లడంతో అధ్వానంగా తయారైంది. దీంతో, సంబంధిత అధికారులు ఈ విషయాన్ని వెంటనే ఎస్‌ఐ నాగార్జున, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇలాగైతే ఎలా అంటూ ఆర్అండ్‌బీ డీఈ రమణయ్య, ఏఈఈ యూనస్‌లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దమ్ము చక్రాల ట్రాక్టర్లు ఈ విధంగా తిరగడం వల్ల రహదారులు అధ్వానంగా తయారవడమే కాకుండా కోట్ల రూపాయల్లో నష్టం వస్తోందని ఎమ్మెల్యే భావించారు. ఈ నేపథ్యంలో మొదట వారిని మందలించాలని, ఆ తర్వాత కేసులు పెట్టాలని ఎస్‌ఐను ఎమ్మెల్యే ఆదేశించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో మాదిరిగా ఇనుప చక్రాలకు పట్టీ వేయాలని సూచించారు. కాగా, ఈ నెల 2న ఈ రోడ్డుకు కలెక్టర్ సమక్షంలో నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆటోనగర్‌లో మిత్ర ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు పాల్గొని పలువురు ఆటో యూనియన్ నాయకులకు సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రూపాయల సభ్యత్వంతో రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చన్నారు. సభ్యత్వం తీసుకున్న కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ, వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నూర్ బాషా జానీ బాబు, పోట్ల అంజనేయులు, అబ్దుల్ నబీ, గుజ్జర్లపూడి స్టాలిన్, మార్కెట్ రాజు, పలువురు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వం తీసుకున్న వారి వివరాలు సెల్‌ఫోన్లో చూపిస్తున్న మాజీ మేయర్ నాగరాజు

● రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తబోధనం గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శుక్రవారం గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎక్కువ మందికి సభ్యత్వం ఇవ్వాలన్నారు. అనంతరం సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, సర్పంచ్ శ్రీను, సేతురు, మాజీ సర్పంచులు సైదయ్య, పులిబండ్ల సాంబశివరావు, వాసా వెంకటేశ్వర్లు, పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు, క్లస్టర్ ఇన్‌చార్జ్ లంకా వీరయ్య రామాంజనేయులు, కొత్తూరు యల్లయ్య చాట్ల దేవదాసు తదితరులు ఉన్నారు.

● మాచవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు మాచవరం మండలంలో వేగంగా కొనసాగుతుంది. వంద రూపాయలతో టీడీపీ సభ్యత్వం పొందితే రూ.5 లక్షలు ప్రమాద బీమా పార్టీ తరుపున వర్తిస్తుందని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు లఘువరపు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ సభ్యత్వం రెండు సంవత్సరాల పాటు వర్తిస్తుందని, పార్టీలో కూడా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సభ్యత్వం వల్ల పార్టీ పరంగా అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యత్వంలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుది వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


● అచ్చంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు వేగవంతమయ్యాయి. గ్రామ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో 70కి పైగా సభ్యత్వాలు నమోదయ్యాయి. మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కొమ్మవరపు దిబ్బయ్య, కొమ్మవరపు గంగయ్య, చిలుకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగంగా జరుగుతున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఏమైనా జరిగితే రూ.5 లక్షల వరకు బీమా చెల్లింపు ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలోకెల్లా బెల్లంకొండ మండలం సభ్యత్వ నమోదులో ముందంజలో ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఒప్పిచర్ల విద్యార్థులు

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు మండలంలోని ఒప్పిచర్ల జడ్పీహెచ్ విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం విజయలలిత తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో గత నెలలో కారంపూడిలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాల బాలికల ఖోఖో జట్ల ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు బొమ్మనిబోయిన లక్ష్మీ ప్రసన్న, షేక్ మహిమున్నీసా, మిద్దెపోగు రవికుమార్, వీరదాసు మనోహర్‌లు స్థానం దక్కించుకున్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జగదీశ్వరరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్లవీడు అంగన్‌వాడీ కేంద్రాన్ని స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. అనంతరం గ్రామ సచివాలయం, ఎంపీపీ పాఠశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. ఆ తర్వాత శిరిగిరిపాడు, లోయపల్లి సచివాలయాలను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీ చైర్మన్ పదవి వైసీపీ కోరడం విడ్డూరం : జనసేన

మాచర్లటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఏసీ చైర్మన్ పదవిని వైసీపీ కోరడం విడ్డూరంగా ఉందని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీకి ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు పీఏసీ చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, కటకం భవన్నారాయణ, తోటకూర వెంకటేశ్వర్లు, సూరె సుబ్రహ్మణ్యం, సుధీర్, కొటారు సైదారావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం సచివాలయంలో తనిఖీ

గురజాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామ సచివాలయాన్ని స్పెషలాఫీసర్ విజయభాస్కరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు,విద్యార్థులు

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొదమగుండ్ల జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం స్నేహహస్తాలు ఫౌండేషన్ అధ్వర్యంలో 100 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వీ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల బూత్ కన్వీనర్ ప్రభాకరరావు, హెచ్ఎం ఎన్‌వీ సాంబశివరావు, ఎస్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : పీడీ

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజకవర్గంలో జగనన్న లే అవుట్‌లలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ శాఖ పీడీ వేణుగోపాల్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణాలపై సమావేశం జరిగింది. వేణుగోపాల్ మాట్లాడుతూ సత్తెనపల్లికి సంబంధించి 3,235 గృహాలు మంజూరు కాగా 1474 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని, 97 నేటికి ప్రారంభించలేదని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను, సిబ్బందిని, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంట్, ఇసుక కాంట్రాక్టర్లకు అందించాలని స్థానిక హౌసింగ్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఆప్షన్-3 కింద గృహాలను నిర్మించే కాంట్రాక్టర్లు డిసెంబరు 10 నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. కమిషనర్ షమ్మి, హౌసింగ్ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈలు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో న్యాయవాది హత్య, విశాఖపట్నంలో మహిళా న్యాయ విద్యార్థిపై లైంగిక దాడిని ఖండిస్తూ శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.అనీల్ కుమార్ అధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరరావు, బీవీఎల్ చిన్నయ్య, కల్లం వీరభాస్కరరెడ్డి, నరిచేటి వేణుగోపాల్, జానీ ఖాజావలి, జూపల్లి శేషయ్య, బొక్కా సంగీతరావు, పాపారావు, విద్యా సాగరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది హత్య, విశాఖపట్నం మహిళా న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా పిడుగురాళ్ల కోర్టు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి అధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పి.నవ్య, లోకేశ్వరి, కోటేశ్వరరావు, న్యాయవాదులు ఆయాజ్ అహ్మద్, రామకృష్ణ, రమేష్, మందా జాకబ్, ఎం.వెంకటేశ్వర్లు, ఈసా తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేత

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాల్వలకు ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఎన్ఎస్‌పీ కెనాల్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం విజయవాడలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతి పత్రం అందించారు. ప్రాజెక్టు కాలువలకు శాశ్వత పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన, చనిపోయిన వారి స్థానంలో తిరిగి నియామకాలు చేపట్టకపోవటంతో ప్రమోషన్‌లు, బదిలీలు ఆగాయన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు.

స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసిన డీఎస్పీ

ముప్పాళ్ళ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌ను సత్తెనపల్లి డీఎస్పీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ సోమేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నేరస్తులపై నిఘా పెంచాలని, నేర ప్రవృత్తి కలిగిన వారి కదలికలపై ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారి వెంట రూరల్ సీఐ సుబ్బారావు ఉన్నారు.

జగన్ బెయిల్ రద్దు చేసి జైలుకు పంపించాలి

క్రోసూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఉగ్రవాది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేసి వెంటనే జైలుకు పంపించాలని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి అన్నారు. శుక్రవారం వారు క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టు కేటాయింపుల్లో అదానీ నుంచి రూ.1750 కోట్ల లంచాలు తీసుకొని జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై మోయలేని భారాలు మోపారని విమర్శించారు. వారితో పాటు టీడీపీ నాయకులు నలజాల కోటేశ్వరరావు, మల్లాల రామాంజనేయులు, దుద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, మన్నెం శివయ్య తదితరులు సమావేశంలో ఉన్నారు.

బాలెమర్రు ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన తనిఖీ

క్రోసూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాలెమర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈవో-2 గణేష్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడరాదని ఏజెన్సీల వారికి సూచించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు శరత్, సీఆర్‌పీ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్‌పై ఫిర్యాదు చేసిన ఖాతాదారులు

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ముత్తూట్ ఫైనాన్స్‌లో తమను మోసం చేశారని ఖాతాదారులు ఇరువురు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన వివ్వర్ల సైదులు బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.82 వేలు నగదు తీసుకున్నారు. ప్రతి నెలా కిస్తీలు కడుతున్నప్పటికీ రసీదులు ఇవ్వకుండా మోసం చేశారని, వడ్డీ నిమిత్తం జమ చేస్తున్న నగదును స్వాహా చేశారని తెలిపారు. అదే విధంగా ముప్పాళ్ళ మండలం నార్నెపాడుకు చెందిన టీ విజయ కుమార్ ఈ సంవత్సరం ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టి రూ.60 వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లిద్దామని బ్యాంక్‌కు వెళ్ళగా రూ.1.20 లక్షలు చెల్లించాలని బ్యాంక్ మేనేజర్ చెప్పారన్నారు. తనకు తెలియకుండా టీ.ఆదాం పేరుపై రూ.50 వేలు లోను తీసుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నామని పట్టణ సీఐ బ్రహ్మం తెలిపారు.

రూ.3,74,330 విలువ గల ఎరువులు సీజ్

ముప్పాళ్ళ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాగంటివారిపాలెంలో ఉన్న అంజిరెడ్డి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీ.శివాజీ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. షాపులోని ఎరువులు, పురుగు మందుల ఇన్వాయిస్ రిజిస్టర్లను, లైసెన్స్‌ను పరిశీలించి సరైన పత్రాలను చూపించకపోవటం వల్ల రూ.3,74,330 విలువ గల ఎరువులను సీజ్ చేసినట్టు తెలిపారు. వారి వెంట గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో చల్లగుండ్ల ఆదినారాయణ, ముప్పాళ్ళ ఏవో అరుణ తదితరులు ఉన్నారు.

4500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మాచర్లటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాల పరిధిలో శుక్రవారం దాడులు జరిపి 4,500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేశామని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుర్గి మండలం ఓబులేశునిపల్లెలో రెండు లీటర్లు నాటుసారా కలిగిన వ్యక్తిపై, మాచర్ల మండలం రేగులవరం తండాలో ఓ వ్యక్తి వద్ద తెలంగాణ మద్యం 8 బీరు సీసాలు కలిగి ఉన్నట్లు గుర్తించి అతనిపైనా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ మణికంఠ, గద్దె సూర్యనారాయణ, మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.

మాయ మాటలతో బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై ఫోక్సో కేసు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నకరికల్లు మండలానికి చెందిన ఓ బాలికను పెదకూరపాడు మండలం లగడపాడుకు చెందిన 31 సంవత్సరాల యువకుడు మాయమాటలు చెప్పి గుంటూరు తీసుకువచ్చి పెళ్లి చేసుకున్నాడు. అయితే ఆ యువకుడికి గతంలోనే వివాహం జరగ్గా భార్యాభర్తలు విడిపోయారు. బాలికను పెళ్లి చేసుకుని గుంటూరులో కాపురం ఉంటున్నాడు. అయితే ఇటీవల బాలికను వేధించి, తనకొద్దని బెదిరించడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టేడియం పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మాణంలో ఉన్న స్టేడియం పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. దీని పై రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఎం.రామ్ ప్రసాదరెడ్డి సానుకూలంగా స్పందించారు. రాబోయే కాలంలో స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి చేయించారని, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మైదానం, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందని కన్నా అసెంబ్లీలో సభ దృష్టికి తీసుకువెళ్ళారు. సత్తెనపల్లిలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ మధ్యనే రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరిగాయని తెలిపారు. ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం స్టేడియం అభివృద్ధిని పట్టించు కోలేదన్నారు.

శాసన సభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకి సత్కారం



జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న మంత్రి మనోహర్, ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ చీఫ్ విప్‌గా నూతనంగా నియమించబడిన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శాలువాతో, జ్ఞాపికతో సత్కరించారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం విజయవాడలోని జీఆర్‌టీ హోటల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మనోహర్, ఎమ్మెల్యే ప్రవీణ్, పలువురు చీఫ్ విప్‌లను కూడా దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో రాష్ట్ర అభివృద్ధికి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన కోరారు.

దొంగతనాల నియంత్రణకు పటిష్ట చర్యలు: ఎస్పీ



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మాచర్లటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దొంగనాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టనట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెల్దుర్తి మండల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దొంగతనాలను నిరోధించేందుకు రాత్రి వేళల్లో గస్తీ పెంచామని, సీసీ కెమెరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ జగదీష్, మాచర్ల పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకరరావు, రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా, ఎస్ఐలు నారాయణ, సంధ్యారాణి ఉన్నారు.

దాచేపల్లి స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

దాచేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారంపూడి, గురజాల పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేసి నరసరావుపేట వెళ్తూ మార్గమధ్యంలోని దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గతంలో జరిగిన చోరీలు, నేరాలపై జరుగుతున్న పురోగతిపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బండ్ల దానమ్మ తనకు కొంతకాలంగా వేతనం రావడం లేదని, వేతనం ఇప్పించవలసిందిగా ఎస్పీకి లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. దళిత నాయకుడు పట్టిపు మరియదాసు ఎస్పీని కలిసి భూసమస్యపై విన్నవించారు. అనంతరం గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కరరావుతో పలు అంశాలను చర్చించారు. దాచేపల్లి ఎస్ఐలు సౌందర్‌రాజ్, పాపారావు ఉన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

మాచర్లటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా ఆడిట్ సభ్యుడు ఎస్‌కె జమాల్, జిల్లా కార్యదర్శి ఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. యూటీఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా షేక్ నసీర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ఆదినారాయణ, సహాధ్యక్షుడిగా బాలాజీనాయక్, సహాధ్యక్షురాలిగా ఎం పద్మజ, గౌరవాధ్యక్షుడిగా దస్రు, కోశాధికారిగా లంగు, మహిళా కార్యదర్శిగా చిన్నకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

● రెంటచింతల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పని గంటల పెంపు అశాస్త్రీయమని, దీనిని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డాక్టర్ చిన్నమ్మ కోరారు. రెంటచింతలలో శుక్రవారం యూటీఎఫ్ నూతన కమిటీని లూథరన్ బాలికల స్కూల్‌లో జిల్లా కార్యదర్శి పి.అరుణ్‌కుమార్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీసీహెచ్.నాసరయ్య,గౌరవాధ్యక్షుడుగా కె.వెంకటేశ్వరరావు,కార్యదర్శిగా పి.సుదర్శన్,మహిళా కార్యదర్శిగా మేరీ జోస్ఫినా, ఆర్థిక కార్యదర్శిగా జి.రామాచారి,ఆడిట్ కమిటీ సభ్యులుగా షేక్ నజ్మా,జిల్లా కౌన్సిలర్లుగా జి.లింగారెడ్డి, బి.ప్రతాప్,జె.మల్లికార్జున,ఒ.సాగర్‌బాబులు ఎన్నికయ్యారు.

జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదు

● పాఠశాల వ్యాయామ విద్య తనిఖీ అధికారి డాక్టర్ మహబూబ్ బాషా



మాట్లాడుతున్న డాక్టర్ షేక్ మహబూబ్ బాషా

పెదకూరపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని పాఠశాల వ్యాయామ విద్య తనిఖీ అధికారి డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూలును శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ వెంకట నాగరాజు, వివిధ మండలాల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్లు అలపాటి సుజాత, రవి, శ్రీధర్, సత్యనారాయణ, వినోద్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్ మురళీధరరావు, రాయపూడి సాంబశివరావు పాల్గొన్నారు. హైస్కూల్‌లోని పాఠశాల రికార్డులను పరిశీలించిసంతృప్తి వ్యక్తం చేశారు.

వీరుల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు : ఈవో

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీరుల ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఈవో కొల్లి హనుమంతురావు అన్నారు. స్థానిక వీరుల దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఉత్సవాలను ఏర్పాట్లను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.





ఊతమిస్తే.. ఉపాధి

మహిళల ఆర్థిక స్వాలంభనకు ఒకప్పుడు దిక్సూచిగా నిలిచిన కేంద్రమది. ఎన్నో శిక్షణా తరగతులు నిర్వహించి మహిళల స్వయంఉపాధికి బాటలు వేసిన కేంద్రం అది. అంతేకాదు అక్కడ ప్రింటింగ్, బైడింగ్, మసాల కారం, కేకులు, బనియన్లు తయారీ యూనిట్‌లను మహిళలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. అటువంటి ప్రతిష్టాత్మకమైన నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికారత కేంద్రం (తెలుగు బాల మహిళా ప్రాంగణం) నేడు దాని ప్రాధాన్యాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఊతమిస్తే తెలుగు బాల మహిళా ప్రాంగణం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురుచూస్తున్నారు.

- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

గుంటూరు(విద్య),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయిన అనంతరం 1983లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు బాల మహిళా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఆ క్రమంలోనే గుంటూరు కలెక్టరు బంగ్లా సమీపంలో తెలుగు బాల మహిళా ప్రాంగణం ఏర్పాటు అయింది.



ప్రారంభంలో కేవలం స్వయం ఉపాధి శిక్షణలకే పరిమితమైన ఈ కేంద్రంలో తర్వాత అనేక స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటయ్యాయి. తొలుత ప్రింటింగ్, బైండింగ్ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ప్రభుత్వ ప్రచారం కోసం ఉపయోగించే కరపత్రాలు, మల్టీకలర్ పోస్టర్స్ వంటివి ఇక్కడ ముద్రించి అందించే వారు. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే అనేక ప్రింటింగ్ సామగ్రి ఈ కేంద్రానికే వచ్చేవి ఫలితంగా ఆర్థిక పరిపుష్టి సాధించడంతో కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బనియన్ల తయారీ, కేక్స్ యూనిట్, మసాల కారం, చెప్పులు, సబ్బులు తయారుచేసే యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేశారు.

మహిళా ప్రాంగణం బ్రాండ్‌తో ఆయా ఉత్పత్తులను విక్రయించే వారు. రాష్ట్రంలో అనేక ప్రదర్శన శాలల్లో మహిళా ప్రాంగణం ఉత్పత్తులను ప్రదర్శించేవారు. ఇలా మంచి ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ప్రాంగణం స్వయం ప్రతిపత్తి సాధించే కీలక దశకు కూడా వచ్చింది. మరోవైపు జడ్పీ నుంచి సెస్‌రూపంలో కొంత మొత్తం నిధులను మహిళా ప్రాంగణాలకు విడుదల చేసే వారు. ఈ నిధులతో కంప్యూటర్ శిక్షణ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, బ్యూటీషియన్, కుట్టుశిక్షణ వంటి స్వయం ఉపాధి శిక్షణలు క్రమం తప్పకుండా నిర్వహించారు. దీంతో వేలాది మంది స్వయం ఉపాధికి ఈ ప్రాంగణం బాటలు వేసింది. అంతేకాదు ఔత్సాహిక మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి బిజినెస్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని కూడా మహిళా ప్రాంగణంలో ఇక్కడ ఏర్పాటు చేశారు.

ఉత్పత్తి కేంద్రాల పతనం ఇలా...

మహిళా ప్రాంగణంలో అనేక యూనిట్లులో పనిచేస్తున్న కీలకమైన వ్యక్తులు ప్రాంగణంలో అప్పట్లో విధులు నిర్వర్తించిన మేనేజర్లు కమీషన్లకు కక్కుర్తిపడి ఇక్కడకి వచ్చిన ప్రింటింగ్ ఆర్డర్స్ సకాలంలో పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రైవేటు ప్రెస్‌లకు తరలించేలా సిండికేట్ నడిపించారు. అంతేకాదు లక్షల విలువైన స్టేషనరీ పంపిణీ కూడా క్రమంగా ప్రైవేటు వ్యక్తుల పరమైంది.

ప్రాంగణంలో ఉన్న కేక్‌యూనిట్, మసాలా కారం తయారీ యూనిట్లును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ తర్వాత మార్కెటింగ్ నిర్వహణా లోపం కారణంగా బనియన్ల తయారీ, చెప్పుల యూనిట్ మూతపడింది. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వ హయంలో మహిళా ప్రాంగణం మరింత దీన స్థితికి చేరింది. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలోని అనేక యూనిట్ల యంత్రాలు, సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థల నుంచి నిధులు నిలిచిపోవడంతో సిబ్బంది జీతాలకే వెదుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర మహిళ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ కావలి గ్రీష్మ ప్రాంగణాలకు పూర్వ వైభం తీసుకువస్తామని ప్రకటించారు. ఈనేపథ్యంలో అక్కడ ఉత్పత్తి కేంద్రాలకు పూర్వవైభవం వస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురు చూస్తున్నారు.


శిక్షణ లేక గోదాముకు చేరిన కుట్టుమిషన్లు


షెడ్డులో దుమ్ముపట్టి పోతున్న ప్రింటింగ్ యూనిట్



రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పునఃప్రారంభం


అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని మొత్తం రోడ్లన్నీ పూర్తిగా కొత్తరూపు సంతరించుకుంటాయని ఏపీ రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన మంగళగిరి-నిడమర్రు ఎన్‌డీబీ రోడ్డు పనులను శుక్రవారం మంత్రి పునఃప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు.

ఈసందర్భంగా మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సహచర మంత్రి నారా లోకేశ్ సొంత నియోజకవర్గంలో ఎన్‌డీబీ రోడ్ల పనులను తిరిగి ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. గత ప్రభుత్వం ఎన్‌డీబీ రోడ్లకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించడంతో రోడ్ల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని స్పష్టం చేశారు. అధ్వాన రహదార్లతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోయాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందలేకపోవడానికి అధ్వాన్న రోడ్లే కారణమని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం రూ.861 కోట్లతో ఇప్పటికే పనులను కూడా ప్రారంభించిందని తెలిపారు. తానే స్వయంగా కాంట్రాక్టర్లతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో తిరిగి పనులు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. జిల్లాలో రూ.120 కోట్లతోను, మంగళగిరి నియోజకవర్గంలో రూ.51.06 కోట్లతోను పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రజలకు అసౌకర్యం లేని రహదారులే లక్ష్యంగా పీపీపీ పద్ధతిలో కొత్త రహదార్ల ఏర్పాటుకు కొన్ని జిల్లాలను ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం మంత్రి జనార్దన్‌రెడ్డి నిడమర్రు గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మంగళగిరి-పరిమి రోడ్డును విస్తరించాలని గ్రామస్థులు కోరడంతో సానుకూలంగా స్పందించారు.

ఈకార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ నయీముల్లా, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుర్రా బ్రహ్మం, నేతలు ఉయ్యూరు సాంబిరెడ్డి, గాదె లక్ష్మారెడ్డి, బూదాటి ఏడుకొండలు, కొమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంఠం వెంకటరెడ్డి, కుర్రా పుల్లయ్య, బొల్లా రంగారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు.. నిధులు

(5వ పేజీ తరువాయి..)

నిదులు విడుదల చేసింది. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాల్లోనే ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిమ్మ, నారింజ, బొప్పాయి, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి కూరల మొక్కలు పెంచి వాటితోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది.

- గుంటూరు జిల్లా: 152 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.54.72 లక్షలు, 188 కేంద్రాల్లో మంచినీటి సదుపాయానికి రూ.32 లక్షలు, పోషణ వాటిక, వర్షపు నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన కింద 204 కేంద్రాలకు రూ.93.43 లక్షలు కేటాయించింది.
- బాపట్ల జిల్లా: 190 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.68.40 లక్షలు, 258 కేంద్రాల్లో మంచినీటి సదుపాయాలకు రూ.43.86 లక్షలు, 261 కేంద్రాల్లో పోషణ వాటికలు, వర్షపు నీటి నిర్వహణకు కోటి 19 లక్షల 8 వేలు కేటాయించింది.
- పల్నాడు జిల్లా: 243 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.87.48 లక్షలు, 369 కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలకు రూ.62.73 లక్షలు, 67 కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోషణ వాటికల ఏర్పాటు, వర్షపునీటి యాజమాన్యం నిర్వహణకు రూ.30.68 లక్షలు కేటాయించింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపరింటెండెంట్ రమణ యశస్వి

ఆధునిక వైద్య విధానంపై అవగాహన అవసరం

- జీఎంసీ ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుందరాచారి వెల్లడి
- గుంటూరులో ప్రారంభమైన ఐఎంఏ రాష్ట్ర సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో రాణించేందుకు, ఆధునిక వైద్య రంగంలో వస్తున్న నూతన చికిత్సా విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి ఉద్బోధించారు. శుక్రవారం వైద్యకళాశాల జింకానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 66వరాష్ట్ర వార్షికసదస్సు 'ఏపీకాన్ 2024' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీహెచ్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ సుందరాచారి, ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. 16 ఏళ్ల తర్వాత ఐఎంఏ రాష్ట్ర సదస్సు గుంటూరులో నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ సుందరాచారి తెలిపారు. వైద్యరంగంలో ఇప్పుడు పరిశోధన అవకాశాలు పెరిగాయన్నారు. యువ వైద్యులు వ్యాధుల నిర్ధారణ, చికిత్స విధానాలు, పరిశోధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానాల ద్వారా సమర్థ వంతమైన చికిత్సలు రోగులకు లభిస్తున్నాయని, వాటి గురించి తెలుసుకొనేందుకు ఐఎంఏ రాష్ట్రస్థాయి సీఎంఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

సీఎంఈలకు హాజరు తప్పనిసరి..

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ఎం ఫణీకుమార్ మాట్లాడుతూ వైద్యులకు సంవత్సరానికి ఆరు చొప్పున ఐదేళ్లల్లో 30 సీఎంఈ క్రెడిట్ అవర్స్ ఉంటేనేవారి డిగ్రీ మెడికల్ కౌన్సిల్ రీరిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. సభలో ఐఎంఏ రాష్ట్రశాఖ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ గార్లపాటి నందకిషోర్, రాష్ట్ర కారయదర్శి డాక్టర్ పీ ఫణిదర్, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ టీ. సేవకుమార్, గుంటూరుశాఖ అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ వై.సుబ్బారాయుడు, డాక్టర్ బీసాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సైంటిఫిక్ సెషన్ జరిగింది. జింకానా ప్రధాన ఆడిటోరియంలో సైంటిఫిక్ సెషన్‌లో పలువురు వైద్యులు ప్రసంగించారు. మెడికల్‌పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో కూడా సదస్సు జరుగుతుంది.


బావాజీపాలెం ఏరియల్ వ్యూ



బావాజీపాలెం సైనికులు



దేశం కోసం పనిచేయడం సైనికులు గర్వంగా భావిస్తారు. దేశరక్షణలో ముందుంటూ సరిహద్దుల్లో బాధ్యతగా పనిచేస్తూ ఉంటారు. మరి, అటువంటి సైనికులను ఒకరిని కాదు ఇద్దరిని కాదు.. ఏకంగా వందల సంఖ్యలో దేశానికి అందిస్తున్న ఘనత బావూజీపాలెం గ్రామానిది. మూడు నాలుగు తరాలుగా ఈ గ్రామం నుంచి సైన్యంలో పని చేసిన వారు, ప్రస్తుతం చేస్తున్నవారు ఉన్నారు. ఇప్పటికీ ఈ గ్రామం నుంచి 200 మంది సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో సేవలంది స్తున్నారు. సైన్యంలో చేరేందుకు 'సై' అంటున్న సైనికుల గ్రామం బావాజీపాలెం గురించిన విశేషాలు..

- ఇంటికి ఇద్దరు, ముగ్గురు జవాన్లు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

రేపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని నిజాంపట్నం మండలం బావాజీపాలెం గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పనిచేస్తుంటారు. సైన్యంలో పని చేయడమంటే ఎంతో బాధ్యతగా భావిస్తారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యల్లో ఇక్కడ నుంచి ఆర్మీలో పని చేసిన వారున్నారు. నేటికీ అదే స్ఫూర్తితో 200 మందికి పైగానే ఇంటికి ఇద్దరు చొప్పున ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. మైనర్ పంచాయతీ బావాజీపాలెంలో 550 కుటుంబాలు ఉండగా 2,400 మంది జనాభా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సరిహద్దుల్లో విధులు నిర్వహించి ఇప్పటికే 400మంది ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పటికీ 200 మంది సరిహద్దుల్లో పలుప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు.

1980లో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ

ఈగ్రామంలో అత్యధికంగా సైనికులు ఉన్నారని గుర్తించిన ఆర్మీ మద్రాస్ స్పాన్సర్ ఉన్నతాధికారులు 1980లో దీనిని దత్తత తీసుకుని మంచినీటి పథకం నిర్మించారు. అప్పట్లోనే గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్మీలో చేసే వారి కోసం ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ గ్రామం నుంచి ఎవరైనా ఆర్మీలో చేరేందుకు వెళితే వెంటనే వారికి అనుమతులు మంజూరు చేస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో..

ఈ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, అబ్దుల్ హమీమ్‌లు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. మహ్మద్ యాకబ్, అబ్దుల్ అజీద్, అహ్మద్ రఫీ, రియాజ్ బాషా, మహ్మద్ పారూక్ సైన్యంలో సేవలు అందిస్తూ పలు ప్రమాదాల్లో మృతి చెందారు. వీరిలో కొందరు కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు.


ఆర్మీ దత్తత తీసుకుని నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్

అబ్బాయి పుడితే ఆర్మీకే

గ్రామంలో ఎవరి కుటుంబంలోనైనా అబ్బాయి పుడితే ఆర్మీకే పంపుతారు. తండ్రులు ఆర్మీలో చేరడం వారి తనయులను పంపటం ఆనవాయితీగా వస్తోంది. తండ్రులు, తనయులు, ఇంటి అల్లుళ్లతో కలిసి ఒకే ఇంట్లో ముగ్గురు,నలుగురు చొప్పున సైనికులు కూడా ఉన్నారు. కాశ్మీర్,రాజస్థాన్, చైనా బోర్డరులో విధులు నిర్వహిస్తూ దేశానికే గర్వకారణంగా బావూజీపాలెం నిలుస్తుంది.

అమ్మాయి పుడితే సైనికుడితోనే పెళ్ళి

మిలటరీ కుటుంబాల్లో అమ్మాయి పుడితే సైన్యంలో పనిచేసే వ్యక్తికే ఇచ్చి వివాహం జరిపిస్తారు.ఆర్మీలో చేసే వ్యక్తినే ఆ ఊరి ఆడపిల్ల మనువాడటానికి మక్కువ చూపుతుంది. ఇప్పటికే సుమారు 100 మందికి పైగా ఆఊరి ఆడపిల్లలు సైన్యంలో పని చేసే వారినే పెళ్లిళ్ల చేసుకున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు.



శ్రీలంక, కార్గిల్ యుద్ధాల్లో సేవలు

- అమానుల్లాఖాన్,మాజీ సైనికుడు

దేశసరిహద్దుల్లో వివిధ ప్రాంతాల్లో 30 ఏళ్ళ పాటు పని చేసి సుబేదారుగా ఉద్యోగ విరమణ చేశా. అప్పట్లో ఎలాంటి సమాచార వ్యవస్థ ఉండేది కాదు. కుటుంబ సభ్యులు యోగక్షేమాలు తెలిసేవికాదు. యుద్ధ సమయాల్లో కుటుంబసభ్యులు గుర్తుకు వచ్చినా 'దేశం తర్వాతే కుటుంబం' అనే నినాదంతో పనిచేశాం. నా తండ్రి ఆర్మీలోనే పనిచేశారు. నా కుమారుడిని ఆర్మీలోకి పంపాను. సైన్యంలో పనిచేసే వ్యక్తితోనే నా కుమార్తెకు వివాహం జరిపించాను.



నేనూ తమ్ముడు సైన్యంలోనే..

- సిరాజుద్దీన్ బాబు,సైనికుడు.

మా తాత, నాన్న ఆర్మీ లోనే పని చేశారు. నేనూ, నాతమ్ముడు కూడా సైన్యంలోనే పనిచేస్తున్నాం. మా అక్కను ఆర్మీలో పనిచేసే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశాం. మా గ్రామానికి సైనికుల గ్రామంగా గుర్తింపు ఉంది. ఆ మాటలు వింటే గర్వంగా ఉంటుంది. మాజీ సైనికుడే ప్రస్తుతం మా గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



నాలుగు తరాలు మిలటరీలోనే విధులు

- మస్తాన్‌వలీ, మాజీ సైనికుడు

దేశ రక్షణ కోసం మా కుటుంబం నుంచి నాలుగు తరాలుగా సైన్యంలో పనిచేస్తున్నాం. మంచుకొండలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించాం. 1965లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నేను 1987లో ఉద్యోగ విరమణ చేశాను. జమ్మూకాశ్మీర్, మిజోరాం, అబీపూర్, శ్రీగంగానగర్‌లో పంజాబ్‌లో విధులు నిర్వహించాను. మా తాత మహ్మద్ అనీఫ్ మిలటరీ విధులు నిర్వహించారు. యుద్ధంలో మృతి చెందారు. మా తండ్రి అహ్మద్ ఇబ్రహీం ముప్పై ఏళ్ల పాటు దేశరక్షణకు సేవలు అందించారు. నా ముగ్గురు కుమారులు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలను కూడా ఆర్మీలో పనిచేసేవారికి ఇచ్చి పెళ్లిళ్లు చేశాను. దేశ వ్యాప్తంగా మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉండటం గర్వపడే విషయం.

పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

నరసరావుపేట పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

నరసరావుపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాగునీటి పైపు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం నరసరావుపేట పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ తెలిపారు. నరసరావుపేట పట్టణంలో రావిపాడు రోడ్డులోని ప్రధాన పైపులైనుకు లీకులు ఏర్పడటంతో శనివారం మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. ఆదివారం సాయంత్రం నుంచి తాగునీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎమ్మెల్యే చదలవాడ తదితరులు

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును సచివాలయం సీఎం చాంబర్‌లో శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియజేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వహించిన క్లీన్ నరసరావుపేట కార్యక్రమం గురించి ముఖ్యమంత్రికి తెలియజేశారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక: కలెక్టర్

నరసరావు పేట రూరల్, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేటి నుంచి ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా నాలుగో శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. నేటి నుంచి ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పరిష్కార వేదికను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

నేడు, రేపు ఓటర్ల కోసం ప్రత్యేక శిబిరం

నాదెండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఓటర్ల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు సహాయ ఎన్నికల అధికారి ఏపీ రమణ తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, బదిలీలకు సంబంధించి ఈ శిబిరాల్లో అర్జీలు ఇవ్వవచ్చని వివరించారు. అన్ని పోలింగ్ బూత్‌లలో రెండు రోజుల పాటు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఆమె పేర్కొన్నారు.

18 రకాల పరిమళ పుష్పాలతో మంజునాథస్వామికి అలంకరణ

వినుకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంను పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మంజునాథ దేవాలయంలో బహుళ పక్షంలో జరిగే విశేష అభిషేక కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని పినాకపాణి రుద్రుడిగా మహాగౌరి దేవత ప్రీతికోసం 18రకాల సుగంధ పరిమళ పుష్పాలతో అభిషేకం చేశారు.

టిడ్కో గృహాల వద్ద పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు వినతి

చిలకలూరిపేట, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువు రోడ్డులో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఒక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని నెలకొల్పాలని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ జంగా సుజాత, టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ జంగా వినాయకరావు శుక్రవారం కోరారు. ఈ మేరకు వారు ఒక వినతి పత్రాన్ని మునిసిపల్ కమిషనర్ శ్రీహరిరావుకు అందచేశారు.

మంత్రి ప్రకటనపై వలంటీర్ల నిరసన

చిలకలూరిపేట, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపునకు సంబంధించి శాసనమండలిలో గ్రామ సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చేసిన ప్రకటనపై వలంటీర్లు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల అసోసియేషన్ కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరారు.

పేదలకు పట్టాలివ్వాలని వినతి

శావల్యాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని చెరువుకట్టపై 70ఏళ్ళుగా నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరుచేసి ఆదుకోవాలని మతుకుమల్లి గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ సుజాతను కలసి వినతి పత్రం అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు ఆదపాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ మతుకుమల్లి గ్రామానికి చెందిన కొందరు తాగునీటి చెరువులో ఆక్రమణలను తొలగించాలని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారని, దీంతో 58కుటుంబాలవారికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు పట్టాలు మంజూరు చేసి, శాశ్వత హక్కును కల్పించాలని కోరారు.

నేడు సైన్స్ ఫెయిర్ క్విజ్ పోటీలు

వినుకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.1000. అందజేయనున్నట్లు తెలిపారు.

రేపు బాబా 73వ ఉరుసు

చిలకలూరిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరంలో మౌలానా మౌల్వీ మహమ్మద్ అబ్దుల్లా బాషబాబా 73 వ ఉరుసు అబ్దుల్ ఖుద్దుస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్నారు. మస్తాన్ వలి ఆధ్వర్యంలో అన్నదానం, సోమవారం దీపారాధనలు జరుగుతాయన్నారు.

అటకెక్కిన లక్ష్యం

● నిరుపయోగంగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు





నిరుపయోగంగా ఉన్న నాదెండ్ల గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రం, మూలనపడిన చెత్త తోలే రిక్షాలు

నాదెండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ఆదాయాన్ని సంపాదించే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేయించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల లక్ష్యం అటకెక్కింది. లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. 2014-2019 సంవత్సరాల కాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను నిర్మించారు గ్రామాన్ని బట్టి సుమారు రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలు వ్యయం అంచనాతో ఈ కేంద్రాలను నిర్మించారు. ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో కేంద్రాలు నిర్మాణం చేశారు. ఈ క్రమంలో ఇంటింటికి రెండు డస్ట్‌బిన్‌లు, చెత్త సేకరణకు రిక్షాలను అందించారు. గ్రామ జనాభానుబట్టి గ్రీన్ అంబాసిడర్లను నియమించుకోవాలని, ఒక్కొక్కరికి రూ 6వేలు జీతం చెల్లించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఆదాయమే లక్ష్యం...

గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్ళి తడి, పొడి చెత్తను సేకరించాలి. సేకరించిన చెత్తతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను కేంద్రానికి తరలించి వేరుచేయాలి. తడి చెత్తనుంచి వాన పాముల ఎరువును తయారుచేసి రైతులకు అమ్మాలి. వీటితో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను అమ్మగా వచ్చిన సొమ్మును పంచాయతీకి జమ చేయాల్సి ఉంది. ఇది ప్రభుత్వ లక్ష్యం. కాగా మండలంలోని నాదెండ్లతో పాటు ఒకటి రెండు గ్రామాలు మినహా ఇతర గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలుకు నోచుకోలేదు. చెత్తను సేకరించి కేంద్రానికి తీసుకురావటమే తప్ప వ్యర్థాలను వేరు చేయటంలేదు. నాదెండ్లలో ఐటీసీ సహకారంతో సుమారు ఐదు సంవత్సరాల పాటు ఈ కేంద్రాన్ని నిర్వహించారు. గడిచిన ఏడాదిన్నరగా అక్కడ ఈ కార్యక్రమం అమలు కావటం లేదు. అక్కడ పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు వయోభారంతో, జీతాలు చాలక ఉద్యోగం మానివేశారు.

రూ.6వేల జీతమైతే కష్టమే

గ్రీన్ అంబాసిడర్లుగా పని చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఒక్క పూట మాత్రమే వారు పనిచేస్తారు కాబట్టి రూ.6వేలు జీతం మాత్రమే ఇవ్వాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఈ క్రమంలో ఆర్థికసంఘం నిధుల నుంచి జీతాలు ఇచ్చేవారు. ఆరువేలతో పాటు మరికొంత కలిపి నాదెండ్ల పంచాయతీలో జీతం ఇచ్చిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి పనులు చేయాలంటే ఒక మోస్తరు జీతం ఇవ్వాల్సిందే. ఈ క్రమంలో ఎవ్వరూ ముందుకు రావటం లేదు. పంచాయతీల్లో వచ్చే ఆదాయం పెంచుకుంటే అంత జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే వారికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం నెరవేరటంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని పలువురు భావిస్తున్నారు.

సభకు రానివారికి అసెంబ్లీలో పదవులు ఎందుకు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజం



వినుకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్‌ను బాయికాట్‌చేసే వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు పీఏసీ ఛైర్మన్ పదవుల కోసం నామినేషన్ ఎందుకు వేశారో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం అసెంబ్లీలో ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యంపైన, ప్రజలన్నా ఎలాగూ గౌరవం లేదని, కనీసం చట్టసభలపై అయినా గౌరవ మర్యాదలు లేకుండా పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమూల్యమైన అసెంబ్లీ సమావేశాన్ని వృధా చేయడం ఎందుకని జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. వైసీపీ పోకడలపై ఆయన నిప్పులు చెరిగారు. ఇప్పుడు ఓటింగ్‌కు రాము అన్న ప్రబుద్ధులు పీఏసీ సభ్యత్వాలకు ఎందుకు పోటీలో నిలిచారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు వారికి ఓట్లు వేసి గెలిపించింది తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని కబుర్లు చెప్పడానికి కాదని గుర్తించుకోవాలన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ తరుపున 23మంది గెలిచినా బాధ్యతగా అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై పోరాటం చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాని ఇప్పుడు జగన్‌రెడ్డి మాత్రం తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రానివారికి పదవులు ఎందుకు తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అన్నింటికి మించి అసెంబ్లీకి రానివారు అసెంబ్లీలో పదవులు అడగడమే పెద్ద విడ్డూరంగా ఉందన్నారు. దానిని బట్టి వాళ్ళు పదవుల కోసమే పనిచేసే నేతలని అర్థమవుతుందన్నారు. ఇదే సందర్భంగా ప్రజలు ఎప్పుడో వైసీపీని బాయ్‌కాట్ చేశారని, అందుకే వారికి జరిగిన ఎన్నికల్లో 11సీట్లకే పరిమితంచేసి బుద్ధిచెప్పారన్నారు. అయినా జగన్‌రెడ్డిలో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. జగన్ హయాంలో గడిచిన ఐదేళ్ళ ఆంధ్రప్రదేశ్‌లో తాలిబాన్ పాలన సాగిందని, పెద్దిరెడ్డి నియోజకవర్గంలో అంతకంటే ఘోరమైన పరిస్థితులు చూశామన్నారు. ఇప్పటికి ఇదే వికృతపోకడలు సాగిస్తే వైసీపీని ప్రజలు శాశ్వతంగా సమాధి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని జీవీ హెచ్చరించారు.

కొండవీడుకోటను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడుకోట ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అభీష్టానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీలో పర్యాటకరంగ అభివృద్ధిపై చర్చ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రతిపాదించారు. చర్చలో పాల్గొన్న ఆయన పురాతన చరిత్ర కలిగిన కొండవీడుకోట విశిష్టతను, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి గల అవకాశాలను సభకు వివరించారు. కొండవీడు కొండలపైకి 5.1 కి.మీల ఘాట్‌రోడ్డు నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, 2019 ఫిబ్రవరిలో కొండవీడు ఉత్సవాలను వైభవంగా ప్రభుత్వం నిర్వహించిందన్నారు. ఆ రోజు జరిగిన బహిరంగసభలో జాతీయ రహదారి నుంచి చౌడవరం వద్ద కొండల మధ్య (టన్నెల్) 5 కి.మీల రహదారి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అక్కడ పెద్దఎత్తున అభివృద్ధి జరగకుండానే పర్యాటకులు వస్తున్నారని, పర్యాటకశాఖ మరింత దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తే ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. ఇస్కాన్ సంస్థ ఈ ప్రాంతంలో ఆలయం కట్టేందుకు ముందుకు వచ్చిందని, అలాగే గోల్కొండ సంస్థల అధినేత రామిరెడ్డి 10ఎకరాలు కేటాయిస్తే ఫైవ్‌స్టార్ హోటల్స్ కట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఎంతో ప్రాచీన కట్టడాలకు, చరిత్రకు నిలయమైన ఈ ప్రాంతం అభివృద్ధికి తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పథకంలో రూ.13వేల కోట్ల అవినీతి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద కేంద్రం ఇచ్చిన దాదాపు రూ.13వేల కోట్ల నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం శాసన సభ జీరో అవర్‌లో మాట్లాడిన ప్రత్తిపాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ హయాంలో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం కక్ష సాధించిందని ప్రత్తిపాటి గుర్తు చేశారు. విజిలెన్స్ విచారణ పేరుతో రకరకాల కొర్రీలు వేసి బిల్లులు చెల్లించ కుండా వేధించారన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల కాలంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేసి బిల్లులు రాక అప్పులు పాలై ఆర్థిక బాధలు భరించ లేక అనేకమంది ఆస్తులు అమ్ముకోగా దాదాపు 50మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీ శాఖ బాధ్యతలు చేపట్టిన తరువాత చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు ఇప్పటికే రూ.330 కోట్లు చెల్లించారని, రూ.4,500 కోట్లతో 30వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమంటూ కొనియాడారు. గతంలో ఉపాధి పథకం పనుల జాబితాలో ఉన్న శ్మశాన వాటికల పనులను వైసీపీ హయాంలో తొలగించారని, వాటిని తిరిగి ఆ జాబితాలో చేర్చాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చీఫ్‌విప్ హోదాలో నేడు వినుకొండకు జీవీ ఆంజనేయులు

● సన్మాన కార్యక్రమానికి భారీ ఎత్తున సన్నాహాలు

వినుకొండ, శావల్యాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులై శాసనసభ సమావేశాల అనంతరం తొలిసారిగా వినుకొండకు వస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు శనివారం ఘన స్వాగతం పలికేందుకు కూటమి పార్టీ నేతలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. తెలుగుదేశం, జనసేన , బీజేపీ నాయకులు వినుకొండ పట్టణంతోపాటు నరసరావుపేట రహదారి వెంబడి పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి స్వాగత తోరణాలను ఏర్పాటుచేశారు. స్వాగత ర్యాలీ శావల్యాపురం మండలం గంటవారిపాలెం నుంచి వినుకొండ నర్సరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పార్టీ నేతలు శుక్రవారం తెలిపారు. శివయ్య స్థూపం వద్ద మధ్యాహ్నం 12:30గంటలకు బహిరంగ సభ అనంతరం గంగినేని ఫంక్షన్ హాల్‌లో జీవీ ఆంజనేయులుకు సన్మానం, సాయంత్రం ఎస్ఎస్‌పీ కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల వసతి గృహ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. జీవీకి ఘనంగా స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని శావల్యాపురం మండల టీడీపీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు శుక్రవారం పిలుపునిచ్చారు.



నగర సంకీర్తన కార్యక్రమంలో కోలాటం చేస్తున్న మహిళలు

ఘనంగా సత్యసాయిబాబా 99వ జయంతి

వినుకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లోని భగవాన్ సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలను భక్తులు వైభవంగా శుక్రవారం నిర్వహించారు. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా పట్టణ పురవీధుల్లో నగరకీర్తన కార్యక్రమంలో భాగంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సత్యసాయి వ్రతకల్పం సామూహిక నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సభ్యులు జిల్లా అధ్యక్షులు సీహెచ్ మాధవ్, సాయి ప్రసాద్, సేవాదళ్ సభ్యులు కైలాస్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ

చిలకలూరిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ భాగంగా శనివారం, ఆదివారం రోజులలో చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలోని బూత్ లెవెల్ అధికారి సమక్షంలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు సహాయ ఓటర్ల నమోదు అధికారి, మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రావు శుక్రవారం తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకొనుటకు, తొలగింపులు, ఓటు కార్డులో సవరణలు చేసుకోవడానికి సంబంధిత బూత్ లెవెల్ అధికారిని సంప్రదించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుప్లంగా...

● శావల్యాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలను సులువుగా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని పశు వైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ అన్నారు. అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరుగ్రామంలో జరుగుతున్న పశుగణనను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● వినుకొండ: కార్తీక మాసం సందర్భంగా డిసెంబరు 1వ తేదీన బ్రాహ్మణ సేవా సంఘం టీడీపీ సీనియర్ నాయకులు పీవీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సేవాసంఘం సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

● నర్సరావుపేట లీగల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా 15 ద్వితీయ శ్రేణి ప్రత్యేక న్యాయాధికారుల పదవులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 13 సాయంత్రం ఐదు గంటలలోగా గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానం కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తు నమూనా తదితర వివరాలు కోసం న్యాయవాద సంఘ కార్యాలయ నోటీస్ బోర్డును చూడాలని కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు తెలిపారు.

● చిలకలూరిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీపేటలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో గుంటూరు జేకేసీ లా కళాశాల విద్యార్థులు చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, మెగావత్ సాయి నాయక్, జేకేసీ లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట: అనుమానస్పద మెసేజ్ వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ అధికారికి తెలియజేయాలని నేషనల్ సెక్యూరిటీ సైబర్ క్రైమ్ డేటాబేస్ అధికారి కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. శుక్రవారం స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ ఎంవీ చరణ్, మహిళా ఎస్సై అరుణ్, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలోని 97 - నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఈ నెల 23, 24వ తేదీలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీలలో పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని న్యాయవాదులు శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ ఆదినారాయణ ఆధ్వర్యంలో రెండు కోర్టులలో విధులను బహిష్కరించారు. విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి, విజయవాడలో సెర్చ్ వారంట్ లేకుండా న్యాయవాది ఇంట్లో జొరబడి పోలీసులు అన్వేషించటం వంటి సంఘటనలకు నిరసనగా సంఘ సభ్యులు విధులు బహిష్కరించారు.

● రొంపిచర్ల : మండల కేంద్ర మైన రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఎన్‌డీపీ కేంద్రాన్ని, దేవవు మాన్యం కాలనీలోని అంగన్ వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని జాతీయ కార్యక్రమాల గురించి రివ్యూ చేశారు. డ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

● జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్): భూములను కొనుగోలు చేయకుండా తమ భూముల్లో రైల్వే అధికారులు సర్వే రాళ్లు వేశారని, వాటిని తొలగించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారి శ్రీనివాసరావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. జొన్నలగడ్డ గ్రామంలో రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించేందుకు శ్రీనివాసరావు శుక్రవారం వచ్చారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని మునమాకలో మండల ప్రత్యేక అధికారి కే సూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయాన్ని, హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. కాలనీలోని పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు కుంపటి రవి ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు





చిలకలూరిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బనాయుడు శుక్రవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రశ్న: ఇటీవల జరిగిన ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు ఏమిటి?

జ: కోటప్పకొండరోడ్డు, నరసరావుపేట రోడ్డు, జాతీయ రహదారిపై 9 ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఐదు నెలలలో ప్రమాదాలలో 12మంది మృతి చెందారు. 25మంది గాయపడ్డారు. ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టడ్స్, వైట్ లైన్స్ ఏర్పాటుచేసి తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: రౌడీ షీటర్లు, అనుమానితులు ఎందరున్నారు?

జ: సర్కిల్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్‌లలో మొత్తం 163మంది రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులు ఉన్నారు. వారికి ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ ఇస్తున్నాము. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాము.

ప్రశ్న: మిస్సింగ్ కేసులు, దొంగతనాల పరిస్థితి ఏమిటి?

జ: మొత్తం ఏడు మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. గణపవరంనకు చెందిన ఒక యువతి మిస్సింగ్ కేసు 24గంటలలో కనుగొన్నాము. దొంగతనాలకు సంబంధించి ఎక్కువగా రైతుల పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు దొంగిలిస్తున్నట్టు గుర్తించాం. ఈ కేసులలో ఇటీవల ఏడుగురు దొంగలను అరెస్టు చేసాం. రెండు ఖరీదైన కార్లను దొంగిలించిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశాము. గొర్రెల సంత వద్ద దారి దోపిడీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపి, వారిపై రౌడీషీట్లు తెరిచాం.

ప్రశ్న: సోషల్ మీడియా కేసులు ఏమైనా నమోదయ్యాయా?

జ: గత మూడు నెలలలో మూడు ఇటువంటి కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో నిందితుని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపాము.

ప్రశ్న: గ్రామాలలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి?

జ: గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొని ఉంది. ముందు జాగ్రత్త చర్యగా గ్రామాలలోని ముఖ్య కూడళ్ళు, విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. ఇప్పటికే కొన్ని చోట్ల కెమెరాల ఏర్పాటు జరిగింది.

ప్రశ్న: మద్యం బెల్ట్ షాపుల పరిస్థితి ఏమిటి?

జ: బెల్ట్ షాపులపై గట్టి నిఘా ఉంచాం. బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించేది లేదు. వారిపై చాలా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఎండుగుంపాలెం, పోతవరం, సొలస తదితర గ్రామాలలో బెల్ట్ షాపు నిర్వాహకులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశాము.

అదనపు ఎస్పీ సంతోష్‌కు నాన్ కేడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌కు నాన్ కేడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. సంతోష్ గతంలో గుంటూరు ఈస్ట్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 22మంది అదనపు ఎస్పీలకు నాన్ కేడర్ ఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. త్వరలోనే వారికి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ చేయనున్నారు.



జాలాదిలోని ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్

యడ్లపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని వంకాయలపాడు, ఉన్నవ, జాలాది గ్రామాలలోని పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వంకాయలపాడు, కొండవీడు మేజర్లతోపాటు పీబీసీ కెనాల్‌లకు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయన్నారు. వంకాయలపాడు మేజరుకు ఉన్నవలోను, కొండవీడు మేజరుకు వంకాయలపాడులోను, పీబీసీ కెనాల్‌కు జాలాదిలోను పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధంచేసి పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఉంచామన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఆర్ఐ జయరాజు, వీఆర్వోలు, బాషా, శివకోటేశ్వరరావు, వీఆర్ఏలు ఉన్నారు.

బైక్ దొంగలు అరెస్టు... ఎనిమిది వాహనాలు స్వాధీనం

నూజెండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్టుచేసి ఎనిమిది మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలు గ్రామానికి చెందిన లింగం యలమంద, కొమ్మిరెడ్డి రామాంజనేయులు గత సంవత్సర కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిని ఐనవోలు సమీపంలో గురువారం అదుపులోకి తీసుకొని విచారించగా రూ.Xలక్షలు విలువ గల ఎనిమిది మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోగులకు ఉన్నతమైన వైద్యసేవలందించాలి

● మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యసిబ్బంది అంకితభావంతో ఉన్నతమైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. మండల ప్రత్యేకాధికారుల సందర్శన కార్యక్రమంలో భాగంగా శావల్యాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, శానంపూడిలోని గ్రామసచివాలయం, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యతో కలసి శుక్రవారం సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఓపీలు, ల్యాబ్‌పరీక్షలు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను ఆరాతీశారు. గ్రామసచివాలయం, పాఠశాలను పరిశీలించి తగిన సూచనలను చేశారు. వీరివెంట వైద్యాధికారి రావిపూడి రమ్య, స్టాఫ్‌నర్స్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేయాలి

● ఎంపీడీవో ఉమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్క ఇంటిని జియో ట్యాగింగ్ చేయాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రతి ఇంటిని జియో ట్యాగ్ చేసి వారి బ్యాంక్ అకౌంట్‌లకు, ఆధార్ కార్డులను అనుసంధానం చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. 25వ తేదీ నాటికి వంద శాతం జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ షేక్ రబ్బానీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.